సాక్షి
మెదక్
గురువారం । 12 । అక్టోబర్ । 2023



గృహ'లక్ష్మి' వరించేనా..!

పేదల సొంతింటి కల సాకారం చేయడానికి ప్రభుత్వం గృహలక్ష్మి పథకం ప్రవేశ పెట్టి నియోజకవర్గానికి మూడు వేల ఇళ్లు మంజూరు చేసింది. వివరాలు 10లో



విద్యార్థి మృతిపై విచారణ

విద్యార్థి మృతిపై వైద్య బృందం విచారణ చేపట్టింది. మృతుడు హుస్నాబాద్‌లోని ఎస్సీ హాస్టల్‌లో ఉంటూ ప్రభుత్వ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. వివరాలు 10లో



తాగునీటి గోస

తాగునీటి సరఫరా సక్రమంగా జరగడం లేదు. రెండు నెలలుగా సమస్యతో అల్లాడుతున్నా ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వివరాలు 11లో ▸

న్యూస్‌రీల్

నిబంధనలు సక్రమంగా అమలు చేయాలి



నర్సాపూర్‌లో మాట్లాడుతున్న జిల్లా అదనపు ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెంకటేశ్వర్లు

నర్సాపూర్: ఎన్నికల కమిషన్ నిబంధనలు సక్రమంగా అమలు చేయాలని జిల్లా అదనపు ఎన్నికల అధికారి వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ ఆఫీసులో ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాల అధికారులు, ఇతర అధికారులతో ఏర్పాటు చేసిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. కమిషన్ నిర్దేశించిన ఎన్నికల నిబంధనలు పకడ్బందీగా అమలు చేయాలని, అన్ని రాజకీయ పార్టీలపై సమదృష్టితో వ్యవహరించాలన్నారు. ఎన్నికల అక్రమాలపై ఫిర్యాదు చేసేందుకు జిల్లా స్థాయిలో ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నంబరు 1950పై విస్తృత ప్రచారం చేయాలని సూచించారు. సమావేశంలో నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్రీనివాసులు, అసిస్టెంట్ ఎలక్షన్ రిటర్నింగ్ అధికారి కమలాద్రి పాల్గొన్నారు.

ఫ్లయింగ్ స్క్వాడ్స్ ఏర్పాటు

నర్సాపూర్: నర్సాపూర్ అసెంబ్లీ నియోజకవర్గంలో సాధారణ ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు ఆరు ఫ్లయింగ్ స్క్వాడ్స్ ఏర్పాటు చేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్రీనివాసులు బుధవారం తెలిపారు. ఒక్కో స్క్వాడ్‌లో ఆఫీసర్, ఏఎస్‌ఐ, కానిస్టేబుల్, హోంగార్డు ఉంటారన్నారు. టి.వేణు(93471 84935), ఎన్.శ్రీనివాస్ (83339 22721), డి.నాగరాజు (94915 66761), ఏ.యాదయ్య (94940 59516), కె.సురేందర్(91823 66539), కె.మణికాంత్‌రావు (93470 35382)లతో బృందాలు ఏర్పాటు చేశామన్నారు. ఎవరైన ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించారని భావిస్తే ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలకు సమాచారం ఇవ్వాలని కోరారు.

కాంగ్రెస్‌లోకి బీఆర్‌ఎస్ సర్పంచ్‌లు?

హవేళిఘణాపూర్(మెదక్): బీఆర్‌ఎస్ పార్టీలో గుర్తింపులేదనే నిరాశలో ఉన్న మెదక్, హవేళి ఘణాపూర్ మండలాలకు చెందిన తొమ్మిది మంది సర్పంచ్‌లు, ఒక ఎంపీటీసీ కాంగ్రెస్‌లో చేరనున్నట్లు విశ్వసనీయవర్గాల ద్వారా బుధవారం తెలిసింది. వీరంతా త్వరలో మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకునేందుకు సిద్ధమైనట్లు సమాచారం.

విద్యార్థినులకు చట్టాలపై అవగాహన ఉండాలి



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న జూనియర్ సివిల్ జడ్జి కల్పన

మెదక్ మున్సిపాలిటీ: విద్యార్థినులకు చట్టాలపై అవగాహన ఉండాలని జూనియర్ సివిల్ జడ్జి కల్పన అన్నారు. బుధవారం ఇంటర్నేషనల్ గర్ల్ చైల్డ్ డే సందర్భంగా ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ ఫర్ గరల్స్‌లో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి కల్పన విద్యార్థినులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్, పోక్సో చట్టం, బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. అలాగే ఆపదలో ఉన్న పిల్లలు 100, చైల్డ్ హెల్ప్ లైన్ నంబర్ 1098కి ఫోన్ చేయాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు, ప్రిన్సిపాల్ హిమబిందు, జూనియర్ వైస్ ప్రిన్సిపాల్ సంధ్యారాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్వేషకర పోస్టులపై కఠిన చర్యలు

ఎస్పీ రోహిణి ప్రియదర్శిని



మెదక్ మున్సిపాలిటీ: సోషల్ మీడియాలో విద్వేషకర, తప్పుడు పోస్టులు పెడితే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ రోహిణి ప్రియదర్శిని హెచ్చరించారు. బుధవారం మెదక్ జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎస్పీ మాట్లాడుతూ సోషల్ మీడియాను దుర్వినియోగం చేయొద్దన్నారు. నిబంధనలు అతిక్రమించి రెచ్చగొట్టే పోస్టులు పెట్టే వారిని పోలీసులు నిరంతరం గమనిస్తారని, అలాంటి వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. తప్పుడు పోస్టులు పెట్టే వారి సమాచారాన్ని పోలీస్ ఐటీ సెల్ 87126 57961 నంబర్‌కు తెలియజేయాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు.

తనిఖీలు ముమ్మరం

- ఎన్నికల దృష్ట్యా జిల్లా చుట్టూ ఐదు చెక్‌పోస్టులు
- రూ.50 వేల వరకు వెంట తీసుకెళ్లే వెసులుబాటు. ఆపై తరలిస్తే పత్రాలు తప్పనిసరి
- లేనిపక్షంలో కేసు నమోదు. కోర్టులో నగదు డిపాజిట్

శాసనసభ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. ఈనెల 9 నుంచి డిసెంబర్ 5వ తేదీ వరకు కోడ్ అమల్లో ఉంటుంది. ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో జరిపేందుకు అధికార యంత్రాంగం పకడ్బందీ చర్యలు చేపట్టింది. ఇప్పటికే పలుమార్లు రాష్ట్ర ఎన్నికల సంఘం జిల్లా ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించింది. మద్యం, డబ్బు, ఇతర వస్తువులతో ఓటర్లను ప్రభావితం చేయకుండా ఉండేందుకు జిల్లా చుట్టూ ఐదు చెక్ పోస్టులను ఏర్పాటు చేశారు. - మెదక్



సంగారెడ్డి–మెదక్ జిల్లాల సరిహద్దులోని పెద్దశంకరంపేట మండలం కోళ్లపల్లి ప్రాంతంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు

ఎన్నికల నేపథ్యంలో రూ.50 వేల వరకు వ్యక్తిగతంగా తీసుకెళ్లేందుకు వెసులు బాటు ఉంటుంది. అంతకంటే ఎక్కువ తరలిస్తే అందుకు లెక్కలు చూపించాల్సి ఉంటుంది. గతంలో వ్యాపారాల నిమిత్తం పెద్ద ఎత్తున డబ్బు తరలించినా ఎలాంటి ఇబ్బంది ఉండేది కాదు. ఎన్నికల కోడ్ అమల్లో రావడంతో అధిక మొత్తంలో నగదు తీసుకెళ్లకూడదు. ప్రస్తుతం పెళ్లిళ్ల సీజన్ కూడా కావటంతో బంగారు ఆభరణాలు, పెళ్లి బట్టలు, ఇతర వస్తువులు కొనుగోలు చేసేందుకు నగదు అవసరం ఉంటుంది. ఫోన్ పే, గూగుల్ పేలో రోజుకు కేవలం రూ.లక్ష మాత్రమే చెల్లించే అవకాశం ఉంది. ఎక్కువ మొత్తంలో నగదు తీసుకెళ్లాల్సివస్తే అధికారులకు లెక్కలు చూపించాలి. లేనిపక్షంలో ఆ నగదును సీజ్ చేస్తారు. గడువులోపు లెక్కలు చూపించకపోతే సదరు వ్యక్తిపై కేసు నమోదు చేస్తారు. అలాగే మద్యం కూడా నిబంధనల మేరకు ఒక్కో వ్యక్తి 12 ఫుల్‌బాటిళ్లు లేదా 24 ఆఫ్ బాటిళ్లను తీసుకెళ్లేందుకు మాత్రమే అనుమతి ఉంది.

ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా..

ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు జిల్లా చుట్టూ ఐదు చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. మెదక్–కామారెడ్డి జిల్లాల సరిహద్దులోని హవేళీఘనాపూర్ మండలం పోచ్చమ్మరాళ్ సమీపంలో, మెదక్–సంగారెడ్డి జిల్లాల సరిహద్దులోని పెద్దశంకరంపేట ప్రాంతంలోని జాతీయ రహదారిపై కోళ్లపల్లి సమీపంలో, రామాయంపేట శివారులోని దామర చెరువు ప్రాంతంలో, తూప్రాన్ టోల్‌గేట్ వద్ద, నర్సాపూర్‌లోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద ఏర్పాటు చేశారు.

గణాంక సర్వేలైన్ టీంలు

జిల్లాలోని చెక్‌పోస్టులతోపాటు పలు సమస్యాత్మక ప్రాంతాల్లో గణాంక సర్వేలైన్ టీమ్‌లను ఏర్పాటు చేశారు. ఇందులో అకౌంట్స్ టీమ్‌లు, వీవీటీ టీమ్‌లు, ఎస్‌ఎస్‌టీమ్‌లు, వీసీటీ టీమ్‌లతో పాటు ఫ్లయింగ్ స్క్వాడ్స్‌ను మెదక్, నర్సాపూర్ నియోజకవర్గాల్లో ఏర్పాటు చేశారు. ఇందులో ప్రధానంగా అకౌంటింగ్ టీమ్ నగదు పట్టుకున్నప్పుడు ఎక్కడి నుంచి తీసుకొస్తున్నారు, ఎక్కడికి తరలిస్తున్నారే అంశాలను పరిగణలోకి తీసుకొని విచారిస్తుంది.

రెండు రకాల సీజ్

ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో అధికారులు తనిఖీలు చేస్తున్నారు. పట్టుబడిన నగదును రెండు రకాలుగా సీజ్ చేస్తారు. ఇందులో రాజకీయ నాయకులకు సంబంధించిన నగదు అయితే సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసి ఆ మొత్తాన్ని కోర్టులో డిపాజిట్ చేస్తారు. అందుకు సంబంధించిన పత్రాలు సమర్పిస్తే తిరిగి ఆ నగదును ఇస్తారు. లేదా కోర్టు తీర్పు ప్రకారం చర్యలు తీసుకుంటారు. ఇక వ్యక్తిగతంగా డబ్బుతో పట్టుబడితే అందుకు సంబంధించిన లెక్కలు చెప్పనట్లయితే ఆ డబ్బును జిల్లాస్థాయిలో ఏర్పాటైన అధికారుల కమిటీకి అందజేస్తారు. పట్టుబడిన సొమ్ము సరైనవే అని కమిటీ విశ్వసిస్తే ఆ సొమ్మును తిరిగి ఇచ్చేస్తారు. ఈ ప్రక్రియ వారంలోగా పూర్తి కావాలి. లేదంటే ఎన్నికల కోడ్ రద్దు చేసిన తరువాతనే ఇస్తారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షిషా

ఓటింగ్ శాతం పెంచాలి

- కళాజాత ప్రదర్శనలతో చైతన్య పర్చాలి
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షిషా

మెదక్ కలెక్టరేట్: జిల్లాలో ఓటింగ్ శాతం పెంచేందుకు ప్రతీ గ్రామంలో ఓటర్లను చైతన్య పరచడానికి సాంస్కృతిక కళాకారులతో కళాజాత కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షిషా అన్నారు. బుధవారం సాధారణ ఎన్నికలలో ఓటింగ్ శాతం పెంచేందుకు 45 రోజుల కార్యాచరణపై ఎన్నికల నోడల్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటు విలువ తెలిపేందుకు కళాకారులతో సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టాలన్నారు. మెదక్, నర్సాపూర్, నియోజకవర్గాలలో సంచార చైతన్య రథాలు ఏర్పాటు చేసి ప్రజలకు ఓటు విలువ, ఈవీఎం వినియోగం తదితర ఎన్నికల అంశాలను వివరించాలన్నారు. ప్రతీ కళాశాలలో రోజువారి స్వీప్ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఓటరు చైతన్య అవగాహన కార్యక్రమాలను ఆర్ఓ, ఏఆర్‌ఓలు తప్పనిసరిగా పర్యవేక్షించాలని ఆదేశించారు. వంద శాతం ఓటింగ్ జరిగేలా అవగాహన కార్యక్రమాలు కొనసాగించాలని సూచించారు. సమీక్షలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, జిల్లా అధికారులు శైలేష్, రాధాకిషన్, కృష్ణయ్య, శ్రీనివాస్, బ్రహ్మాజీ, ఆర్డీఓలు అంబాదాస్ రాజేశ్వర్, శ్రీనివాస్, ఎన్నికల విభాగ పర్యవేక్షణ అధికారి హర్దీప్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

లైసెన్స్ ఆయుధాలు జమ చేయాలి

లైసెన్స్ ఉన్న ఆయుధాలను సంబంధిత పోలీస్ స్టేషన్‌లలో అందజేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షి షా బుధవారం ఆదేశించారు. తెలంగాణ రాష్ట్ర శాసనసభ ఎన్నికలను దృష్ట్యా ఆయుధ చట్టం 1959లోని సెక్షన్ 21 ప్రకారం లైసెన్సింగ్ అథారిటీ ద్వారా ఈ ఏడాది నవంబర్ 30 లోపు తమ ఆయుధాలను సంబంధిత పోలీస్ స్టేషన్‌లలో అందజేయాలన్నారు. లేదా ఈనెల 16 లోపు అధీకృత ఆయుధ డీలర్లకు ఇవ్వాలన్నారు. నిబంధనలు అతి క్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డిపాజిట్ చేసిన ఆయుధాలను డిసెంబర్ 10 తర్వాత తీసుకోవచ్చన్నారు. ఉత్తర్వుల నుంచి మినహాయింపు కోరే వారు మెదక్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని జిల్లా ఆయుధ స్క్రీనింగ్ కమిటీకి దరఖాస్తు చేసుకోవాలని, లేదా డీఆర్‌ఓ పద్మశ్రీని (80195 55968) సంప్రదించాలన్నారు.

దళిత బంధు పేరుతో దగా



పార్టీలోకి ఆహ్వానిస్తున్న మాజీ ఉప ముఖ్యమంత్రి దామోదర రాజనర్సింహ

- గ్రామాలలో బీఆర్‌ఎస్ పార్టీ చిచ్చు
- కాంగ్రెస్‌తోనే తెలంగాణ అభివృద్ధి
- మాజీ ఉప ముఖ్యమంత్రి దామోదర రాజనర్సింహ

అల్లాదుర్గం(మెదక్): దళిత బంధు పేరుతో దళితులను మోసం చేసి, గ్రామాలలో వారి మధ్య బీఆర్‌ఎస్ పార్టీ చిచ్చు పెట్టిందని మాజీ ఉప ముఖ్యమంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. బుధవారం అల్లాదుర్గం, అప్పాజిపల్లి గ్రామాలలో కాంగ్రెస్ పార్టీలో పలువురు చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓట్ల కోసం దళిత బంధు పథకంతో బీఆర్‌ఎస్ పార్టీ గ్రామాలలో దళితుల మధ్య చిచ్చు పెట్టిందన్నారు. గ్రామాల్లో నాలుగైదు ఓట్ల కోసం మంజూరు చేసి చేతులు దులుపుకున్నారని ఆరోపించారు. ఎన్నికల్లో లబ్ధి కోసమే బీసీ బంధు, గృహలక్ష్మి పథకాలు ప్రవేశపెట్టి కేసీఆర్ మోసం చేస్తున్నారన్నారు. తెలంగాణ అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందన్నారు.

భారీగా చేరికలు

అల్లాదుర్గం, అప్పాజిపల్లి, గొల్లకుంట తండాకు చెందిన 150 మంది మాజీ ఉప ముఖ్యమంత్రి, సీడబ్ల్యూసీ శాశ్వత సభ్యుడు దామోదర సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. బీఆర్‌ఎస్ పార్టీ అప్పాజిపల్లి గ్రామ మాజీ అధ్యక్షుడు రుక్కమొల్ల సంగయ్యతో పాటు వంద మంది, గొల్లకుంట, అల్లాదుర్గం గ్రామానికి చెందిన వడ్డెర, బుడగ జంగం కాలనీవాసులు కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు దామోదర్ తెలిపారు.

అల్పాహార నాణ్యత పరిశీలన

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలోని చిన్నగొట్టిముక్కల ఉన్నత పాఠశాలలో అమలు చేస్తున్న అల్పాహార పథకం కార్యక్రమ తీరును డైరెక్టర్ ఆఫ్ గవర్నమెంట్ ఎగ్జామినేషన్ (డీజీఈ) కృష్ణారావు బుధవారం పరిశీలించారు. విద్యార్థులతో కలిసి అల్పాహారం చేశారు. అల్పాహార నాణ్యత వివరాలు తెలుసుకున్నారు. ఆయన వెంట ఎంఈఓ బుచ్చానాయక్ ఉన్నారు.

ఆ రెండు పార్టీల వైఫల్యాలు వివరించాలి

మెదక్ కలెక్టరేట్: కేసీఆర్ వైఫల్యాలు, కాంగ్రెస్ మోసాలను ప్రజలకు అర్థమయ్యేలా వివరిస్తూ బీజేపీని బూత్‌స్థాయిలో బలోపేతం చేయాలని జోనల్ ఇన్‌చార్జి, ఎమ్మెల్యే అభయ్ పటేల్ అన్నారు. బుధవారం మెదక్ నియోజకవర్గంలోని అన్ని మండలాల కార్యకర్తలు, శక్తి కేంద్ర ఇన్‌చార్జిలు, జిల్లా పదాతికారులు, రాష్ట్ర బాధ్యులతో మెదక్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి కర్ణాటక రాష్ట్రం నుంచి ఎమ్మెల్యే అభయ్ పటేల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ పోలింగ్ బూత్‌లో ఉన్న కమిటీని బలోపేతం చేస్తూ, నరేంద్ర మోదీ సంక్షేమ పథకాలు ప్రజలకు తెలియజేయాలన్నారు. నియోజకవర్గంలో బీజేపీ జెండా ఎగరవేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నందు జనార్ధన్ రెడ్డి, పంజా విజయ్ కుమార్, ప్రధాన కార్యదర్శులు సుధాకర్ రెడ్డి, నల్లాల విజయ్, నందా రెడ్డి, శ్రీనివాస్, మోర్చాల జిల్లా అధ్యక్షులు బెండవీన, ఉదయ్ కుమార్, మల్లారెడ్డి, ఆయా మండలాల అధ్యక్షులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ యుద్ధం ప్రారంభమైంది

మెదక్ మున్సిపాలిటీ: ఎస్సీ వర్గీకరణకు మాదిగల విశ్వరూప పాదయాత్ర పేరిట మంద కృష్ణ మాదిగ మరో యుద్ధాన్ని ప్రారంభించారని, ఆ పోరాటానికి మాదిగలు సిద్ధం కావాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి లింగంపల్లి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. బుధవారం మెదక్ జిల్లా కేంద్రంలో ఎమ్మార్పీఎస్ యువజన నాయకుడు బాల్‌రాజ్ అధ్యక్షతన ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 15వ తేదీ నుంచి జిల్లాలో మాదిగల విశ్వరూప పాదయాత్ర ప్రారంభం కానుందన్నారు. ఈ యాత్రలో మాదిగలు, ఉపకులాలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఎస్సీ వర్గీకరణ సంకల్పంతోనే మంద కృష్ణ మాదిగ చారిత్రాత్మక మహాపాదయాత్ర చేస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణపై కాలయాపన చేస్తోందని ఆరోపించారు. తొమ్మిదేళ్లుగా తెలంగాణలో భర్తీ జరిగిన ఉద్యోగ నియామకాల్లో మాదిగ నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. నవంబర్‌లో లక్షలాది మందితో మాదిగల విశ్వరూప మహాసభ జరగబోతుందన్నారు.

శశిధర్ రెడ్డితో హరీశ్ భేటీ

మెదక్: మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డిని బుధవారం రాత్రి హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ పార్టీలోకి ఆహ్వానించారు. ఇందుకు శశిధర్‌రెడ్డి సైతం సానుకూలంగా స్పందించినట్లు తెలిసింది. ఆయన వెంట బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు, ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్‌రెడ్డి ఉన్నారు. కాగా శశిధర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతున్నారు. వీరిద్దరి భేటీ ప్రాధాన్యత సంతరించుకుంది.



మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డితో సమావేశమైన మంత్రి హరీశ్‌రావు, ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్‌రెడ్డి

ఇంద్ర ధనుష్‌లో చిన్నారులకు టీకాలు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని రాజిపేటలో బుధవారం మిషన్ ఇంద్ర ధనుష్ కార్యక్రమాన్ని డీఐఓ డాక్టర్ మాధురి పరిశీలించారు. రాజిపేట అంగన్‌వాడీ కేంద్రంలో ఏఎన్ఎం రేణుక, వైద్యసిబ్బంది చిన్నారులకు రోగనిరోధక టీకాలు వేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రమేష్, అంగన్‌వాడి టీచర్ సుజాత పాల్గొన్నారు.



వివరాలు తెలుసుకుంటున్న డీఐఓ డాక్టర్ మాధురి

అభివృద్ధి పనులే గెలిపిస్తాయి

ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

మెదక్ మున్సిపాలిటీ: అభివృద్ధి పనులే బీఆర్‌ఎస్ పార్టీని గెలిపిస్తాయని ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం చిన్నశంకరంపేట మండల పరిధిలోని మిర్జాపల్లి ఎంపీటీసీ సక్కుబాయి, ధర్పల్లి ఎంపీటీసీ రాధమ్మ, శేరిపల్లి ఎంపీటీసీ సంతోషతో పాటు 200 మంది కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు బీఆర్‌ఎస్‌లో చేరారు. ఎమ్మెల్యే వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం కేసీఆర్ అన్ని వర్గాల ప్రజలకు సమ ప్రాధాన్యతనిస్తూ సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారన్నారు. బీఆర్‌ఎస్ పాలనలో నియోజకవర్గం దినదినాభివృద్ధి చెందుతోందని చెప్పారు. నియోజవర్గ అభివృద్ధిని ఆకాంక్షించి పార్టీలో చేరడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో చిన్నశంకరంపేట మండల పార్టీ అధ్యక్షుడు రాజు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.



బీఆర్‌ఎస్‌లో చేరుతున్న ఎంపీటీసీలు, కార్యకర్తలు

ఆర్టీసీ దసరా ధమాకా

రీజినల్ మేనేజర్ ప్రభులత

మెదక్ కలెక్టరేట్: దసరా పండగ సందర్భంగా లక్కీ డ్రా నిర్వహించనున్నట్లు ఆర్టీసీ రీజినల్ మేనేజర్ ప్రభులత తెలిపారు. బుధవారం మెదక్ ఆర్టీసీ డిపో పరిధిలో ఉత్తమ సేవలందించిన డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్‌లకు ప్రశంసా పత్రాలతోపాటు నగదు రివార్డులు అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ డ్రైవర్లు ప్రమాదాలు జరగకుండా అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. ప్రయాణికులతో మర్యాదపూర్వకంగా నడుచుకోవాలని సూచించారు. రాఖీ పండగ తరహాలో దసరా పండగకూ లక్కీ డ్రా తీయడం జరుగుతుందని తెలిపారు. ఈనెల 20 నుంచి 23 వరకు, 28 నుంచి 30 వరకు ఆర్టీసీ బస్సులలో ప్రయాణించినవారు తమ టికెట్లను స్థానిక బస్టాండ్లలో ఏర్పాటుచేసిన గిఫ్ట్ బాక్స్‌లలో వేయాలని సూచించారు. డ్రాలో విజేతలుగా నిలిచిన ప్రయాణికులకు ఒకొక్కరికి రూ.9,900 నగదు బహుమతి ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మెదక్ ఆర్ఎం, డీఎం, అసిస్టెంట్ మేనేజర్, డిపో ఉద్యోగులు పాల్గొన్నారు.



అవార్డు పొందిన ఉద్యోగులతో ఆర్ఎం ప్రభులత

స్కూల్ అసిస్టెంట్లను రిలీవ్ చేయాలి

టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి

మెదక్ కలెక్టరేట్: బదిలీ అయిన స్కూల్ అసిస్టెంట్లను వెంటనే విడుదల చేయాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం రాత్రి మెదక్ జిల్లా కేంద్రంలోని కేవల్ కిషన్ భవన్‌లో టీఎస్ యూటీఎఫ్ జిల్లా స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా చావ రవి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన బదిలీలు, పదోన్నతులు పొందిన స్కూల్ అసిస్టెంట్లను వెంటనే రిలీవ్ చేయాలన్నారు. అవసరమైనచోట ప్రత్యామ్నాయ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ లోపభూయిష్ట విధానాలు, కొందరి వ్యక్తిగత స్వార్థం కారణంగా బదిలీలు, పదోన్నతులు నిలిచిపోయి విద్యారంగంలో సంక్షోభం ఏర్పడిందన్నారు. ఫలితంగా విద్యార్థులకు తీవ్ర నష్టం జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుని సంక్షోభం పరిష్కారానికి కృషి చేయాలన్నారు. అంతకు ముందు యూటీఎఫ్ పూర్వ అధ్యక్షుడు నాగటి నారాయణ ప్రథమ వర్ధంతి సభలో మాట్లాడుతూ నిరంతర ఉద్యమకారుడు నాగటి నారాయణ అన్నారు. సామాజిక న్యాయం సాధనకోసం తుది శ్వాస వరకు పోరాడిన యోధుడన్నారు. ఆయన ఆశయాల సాధనకోసం కృషి చేయటమే నిజమైన నివాళి అన్నారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పద్మారావు, ఉపాధ్యక్షులు కవిత, అజయ్ కుమార్, కోశాధికారి రవీందర్ రెడ్డి, కార్యదర్శులు సుధాకర్, శేఖర్, ఫయాజుద్దీన్, పోచయ్య, గణేష్, షాకిర్ అలీ, ప్రేమ్ కుమార్, సీతల్ సింగ్, ప్రభాకర్ ఏసయ్య, చంద్రశేఖర్, బాబు, రాందాస్, పీజీహెచ్ఎం శంకర్, అస్గర్ హుస్సేన్, రియాజ్ అహ్మద్, యూనస్, ఎజాజ్ తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయ సంఘం నాయకులు

క్లుప్తంగా

బాల్య వివాహాలుచేస్తే శిక్షార్హులు


ప్రతిజ్ఞ చేస్తున్న జడ్జి అనిత, అధికారులు

నర్సాపూర్: బాల్య వివాహాలుచేస్తే శిక్ష తప్పదని జూనియర్ సివిల్ జడ్జి, మండల లీగల్ సర్వీస్ కమిటీ చైర్మన్ కె.అనిత హెచ్చరించారు. బుధవారం స్థానిక సోషల్ వెల్ఫేర్, బీసీ వెల్ఫేర్, సాంఘిక సంక్షేమ శాఖల బాలికల వసతి గృహాలలోని మండల లీగల్ సర్వీస్ కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థినులకు పలు చట్టాలపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాలను నిర్మూలించేందుకు బాలికలకు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఆమె సూచించారు. అనంతరం బాల్య వివాహాల నిర్మూలన కోసం విద్యార్థినులతో పాటు ఆమె ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో స్థానిక ఎస్‌ఐ శివ కుమార్, న్యాయవాదులు, పలు వసతిగృహాల సంక్షేమ అధికారులు గాయత్రి, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే గుర్తింపు

జూనియర్ సివిల్ జడ్జి శివరంజని


మాట్లాడుతున్న జడ్జి శివరంజని

హుస్నాబాద్: విద్యతోనే సమాజంలో మంచి గుర్తింపు వస్తుందని జూనియర్ సివిల్ జడ్జి శివరంజని అన్నారు. స్థానిక కస్తూర్బా బాలికల విద్యాలయంలో బుధవారం అంతర్జాతీయ గర్ల్, చైల్డ్ డే సందర్భంగా ఆడపిల్లల హక్కులపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ రాజ్యాంగం ఆడ పిల్లలు జీవించడానికి కొన్ని హక్కులను కల్పించిందన్నారు. సెల్ ఫోన్లతో సమయాన్ని వృథా చేయవద్దని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల స్పెషల్ అధికారి మమత, న్యాయవాదులు బాకం సంపత్, ప్రవీణ్, రాజశేఖర్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఖోఖో జట్టుకు విద్యార్థినులు


రాష్ట్ర ఖోఖో జట్టుకు ఎంపికైన విద్యార్థినులు

తొగుట(దుబ్బాక): రాష్ట్ర స్థాయి అండర్ 19 ఖోఖో జట్టుకు తొగుట ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులు ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ శంకర్ నాయక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని రంగబోయిన మానస, ఎంపీసీ ప్రథమ సంవత్సరం విద్యార్థిని సీత మమత ఎంపికై నట్టు పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో నిర్వహించిన పోటీల్లో పాల్గొని వారు అత్యుత్తమ ప్రతిభకనబరిచి రాష్ట్ర జట్టుకు ఎంపికకావడం అభినందనీయమన్నారు. కళాశాల విద్యార్థినులు రాష్ట్ర జట్టుకు ఎంపిక కావడంపై జిల్లా ఇంటర్ విద్యాధికారి సూర్యప్రకాష్ హర్షం వ్యక్తం చేశారు.

గుండెపోటుతో ఉపాధ్యాయుడి మృతి


నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి చంద్రశేఖర్

జహీరాబాద్: మండలంలోని బూర్దిపాడ్ గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు నర్సింహులు గుండెపోటుతో మరణించాడు. బంధువులు సమాచారం ప్రకారం.. నర్సింహులు ఝరాసంగం మండలంలోని కక్కరవాడ గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. బుధవారం తెల్లవారున గుండె పోటు కు గురై మృతి చెందారు. ఆయన భౌతిక కాయాన్ని ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ వై.నరోత్తమ్, మాజీ మంత్రి ఎ.చంద్రశేఖర్, సామాజిక ఉద్యమ కారుడు ఢిల్లీ వసంత్, ఆయా ఉపాధ్యాయ సంఘాల నేతలు, కాంగ్రెస్, బీజేపీ, బీ ఆర్‌ఎస్ నాయకులు సందర్శించి నివాళులర్పించారు.

గృహ'లక్ష్మి' వరించేనా..!

- అర్ధాంతరంగా నిలిచిన నిర్మాణాలు
- ఆర్థిక సహాయం కోసం ఎదురు చూపులు


గాంధీనగర్‌లో అసంపూర్తిగా ఉన్న ఇల్లు

హుస్నాబాద్‌రూరల్: పేదల సొంతింటి కల సాకారం చేయడానికి ప్రభుత్వం గృహలక్ష్మి పథకం ప్రవేశ పెట్టి నియోజకవర్గానికి మూడు వేల ఇళ్లు మంజూరు చేసింది. హుస్నాబాద్, అక్కన్నపేట మండలాల్లో ఎస్సీ, ఎస్టీ కుటుంబాల సంఖ్య ఎక్కువే. వారిలో చాలామందికి సొంత ఇళ్లు లేవు. దీంతో ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకం ద్వారా డబుల్ బెడ్రూం ఇళ్లు తమకు వస్తాయని ఎదురు చూసినా.. వారందరికీ నిరాశే ఎదురైంది. ఇంటి నిర్మాణ వ్యయం పెరగడంతో ఇళ్లు నిర్మించుకునే వారికి గృహలక్ష్మి పథకం కింద రూ.3 లక్షల ఆర్థిక సహాయం చేయాలని ఉత్తర్వులు ఇవ్వడం, నియోజకవర్గానికి 3 వేల ఇళ్లు మంజూరు చేయడంతో పేదలు తమకు సొంత ఇళ్లు వస్తాయని ఆశించారు. 162 గ్రామాలు ఉన్న నియోజకవర్గానికి 3 వేలు ఇళ్లను గ్రామాల వారీగా కేటాయిస్తే ఊరికి 15 నుంచి 20 మందికే లబ్ధి చేకూరింది. ఇంకా చాలా మంది పేదలు సొంత ఇళ్ల కోసం ఎదురు చూస్తున్నారు.

నిబంధనల పేరుతో దరఖాస్తుల తిరస్కరణ

సిద్దిపేట జిల్లాలో హుస్నాబాద్ నియోజకవర్గంలో చాలా తక్కువ దరఖాస్తులు రావడం అధికారుల కొర్రీలకు నిదర్శనం. బీసీ బంధు పథకం లబ్ధిదారులకు గృహలక్ష్మి దరఖాస్తును అధికారులు తిరస్కరించారు. దీంతో చాలా మంది నిరాశకు గురయ్యారు. ఆర్థిక పరిస్థితి సహకరించకపోవడంతో ఇళ్లను స్లాబ్‌లు వేసి వదిలేశారు. గృహలక్ష్మి పథకం ద్వారా ప్రభుత్వం రూ.3లక్షల ఆర్థిక సాయం చేస్తే తమ ఇళ్లనిర్మాణం పూర్తిచేసుకుంటామని వారంతా వేడుకుంటున్నారు.

మండలానికి 281 ఇళ్లు

ప్రభుత్వం ప్రవేశ పెట్టిన గృహలక్ష్మి పథకం కోసం మండలంలో 781 దరఖాస్తులను ఆన్‌లైన్ చేశాం. అందులో 281 మందిని ఎంపికచేసి ప్రక్రియ మొదలు పెట్టాం. ప్రభుత్వ నిబంధనల మేరకు క్షేత్ర స్థాయిలో విచారణ చేసిన తర్వాతనే ఎంపిక చేస్తాం. ప్రభుత్వం నిబంధనలు సడలిస్తే మరికొన్ని దరఖాస్తులను తీసుకుని ఆన్‌లైన్ చేస్తాం.

– ఎంపీడీఓ రాఘవేంద్రరెడ్డి, హుస్నాబాద్

అక్రమ కేసులు బనాయించడం సరికాదు

బీజేపి జిల్లా ప్రధాన కార్యదర్శి విభీషణ్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న విభీషణ్‌రెడ్డి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు, బీజేపీ నాయకులపై అక్రమ కేసులు పెట్టడం సరికాదని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి విభీషణ్‌రెడ్డి అన్నారు. బుధవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ సిద్దిపేట రైల్వేస్టేషన్ ప్రారంభోత్సవ సమయంలో బీఆర్‌ఎస్ నాయకుల ప్రవర్తన ఘర్షణకు దారి తీసిందన్నారు. మంత్రి హరీశ్‌రావు, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి దేశ ప్రధానిని అవమానించేలా చర్యలకు పాల్పడ్డారని ఆరోపించారు. బీఆర్‌ఎస్ నాయకులపై బీజేపీ నాయకులు ఫిర్యాదు చేయగా ఇంత వరకు కేసు నమోదు చేయలేదన్నారు. ఈ అక్రమ కేసులను ఖండిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కొత్తపల్లి వేణుగోపాల్, నరేష్, యాదవ్‌రావు, సత్యనారాయణ, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సిద్ధిగల్లపేట సిద్దిపేట

పుష్పగిరి పీఠాధిపతి శంకర భారతీ స్వామీజీ


మాట్లాడుతున్న శంకర భారతీ స్వామీజీ

కొండపాక(గజ్వేల్): సిద్ధిగల్లపేట సిద్దిపేట అని పుష్పగిరి పీఠాధిపతి శంకర భారతీ స్వామీజీ పేర్కొన్నారు. కొండపాక శివారులోని ఆనంద నిలయం ఆవరణలో నిర్మిస్తున్న అష్టాదశ శక్తి పీఠ సహిత రామలింగేశ్వర దేవాలయ నిర్మాణాన్ని ఆయన బుధవారం సందర్శించారు. నిర్మాణానికి సంబంధించి కొన్ని సలహాలు, సూచనలు చేశారు. స్వామీజీ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా ఉన్న 18 శక్తి పీఠాల్లో కొండపాకలో నిర్మించే పీఠం ఒకటన్నారు. సిద్దిపేట ప్రాంతం ఎంతో పుణ్యస్థలంగా వెలుగొందుతుందన్నారు. కార్యక్రమంలో వృద్ధాశ్రమ చైర్మన్ లత, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షురాలు చిట్టి మాధురిరెడ్డి, ఆనంద నిలయం ట్రస్టు సభ్యులు వైకుంఠం, గట్టు రవి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అకస్మాత్తుగా టిప్పర్ యూ టర్న్

- ఢీ కొన్న స్కూల్ బస్సు
- విద్యార్థులకు తప్పిన పెను ప్రమాదం



ప్రమాదంలో ముందు భాగం దెబ్బతిన్న స్కూల్ బస్సు

మనోహరాబాద్(తూప్రాన్): ఆకస్మాత్తుగా టిప్పర్ డ్రైవర్ యూటర్న్ తీసుకోవడంతో స్కూల్ బస్సు ఢీ కొట్టింది. దీంతో పలువురు విద్యార్థులకు స్వల్పగాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. బుధవారం మేడ్చల్‌లోని విజ్ఞాన్ పాఠశాల బస్సులో కూచారం, కాళ్లకల్ గ్రామాల విద్యార్థులు ఎక్కారు. ఈ క్రమంలో కాళ్లకల్ శివారులో జాతీయ రహదారి 44పై క్రెస్ట్ కేబుల్ పరిశ్రమ సమీప యూటర్న్ వద్ద టిప్పర్ వేగంగా రోడ్డుపైకి రావడంతో స్కూల్ బస్సు ఢీకొంది. దీంతో బస్సు డ్రైవర్ అప్రమత్తంగా వ్యవహరించడంతో పెను ప్రమాదం తప్పింది. విద్యార్థులు, టీచర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. అయితే బస్సు ముందు భాగం ధ్వంసమైంది. విషయం తెలుసుకున్న స్థానికులు, పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని విద్యార్థులకు చికిత్స చేయించి పాఠశాలకు పంపించారు. బస్సు డ్రైవర్ ఫిర్యాదు మేరకు టిప్పర్ డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపారు.

ఫార్మసీ రంగానికి ఉజ్వల భవిష్యత్తు

జాతీయ డిప్యూటీ డ్రగ్స్ కంట్రోలర్ డా.రాంకిషన్


టాపర్ విద్యార్థినులతో రాంకిషన్ తదితరులు

కొండపాక(గజ్వేల్): ఫార్మసీ రంగానికి ఉజ్వల భవిష్యత్తు ఉందని జాతీయ డిప్యూటీ డ్రగ్స్ కంట్రోలర్ డాక్టర్ రాంకిషన్ అన్నారు. మండంలోని వెలికట్ట శివారులోని శ్రీకృప ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మసీ కళాశాలలో బుధవారం నిర్వహించిన సైన్సు ఓరియెంటేషన్ ప్రోగ్రాంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ దేశాలు ఫార్మసీ రంగంలో దూసుకుపోతున్న భారతదేశం వైపు చూస్తున్నాయని పేర్కొన్నారు. కొండపాకలో బీ ఫార్మసీ కళాశాల ఏర్పాటు ఈ ప్రాంత విద్యార్థుల అదృష్టమన్నారు. జాతీయ డ్రగ్స్ మ్యానుఫేక్చర్స్ అసోసియేషన్ చైర్మన్ రాజమౌళి మాట్లాడుతూ కళాశాలలో 19సార్లు ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహించుకోవడం గొప్ప విషయమన్నారు. కళాశాల నుంచి 16 బ్యాచ్‌ల విద్యార్థులు ఫార్మసీరంగంలో ఉన్నత స్థానాల్లో ఉండటం సంతోషదాయకమన్నారు. అనంతరం టాపర్లుగా నిలిచిన నలుగురు విద్యార్థినులను శాలువాతో సన్మానించి, వెండి పతకాలు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ మల్లారెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పండ్లు, కూరగాయల పంటలతో అధిక దిగుబడులు

సెంట్రల్ ఇంటిగ్రేటెడ్ పెస్ట్ మేనేజ్‌మెంట్ శాస్త్రవేత్తలు


కూరగాయల పంటలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

మర్కూక్(గజ్వేల్): పండ్లు, కూరగాయల తోటల ద్వారా రైతులు అధిక దిగబడులు సాధించవచ్చని సెంట్రల్ ఇంటిగ్రేటెడ్ పెస్ట్ మేనేజ్‌మెంట్ జీడిమెట్ల, హైదరాబాద్ శాస్త్రవేత్తలు సూచించారు. పాతూరు గ్రామంలో కూరగాయల పంటలపై ఫార్మర్ ఫీల్డ్ స్కూల్ నిర్వహించారు. వంగ పంటలో పండ్లు, రెమ్మల తొలుచు పురుగు నివారణ గురించి రైతులకు అవగాహన కల్పించారు. అసిస్టెంట్ ప్లాంట్ ప్రొటెక్షన్ అధికారి డా.స్వేత, ప్లాంట్ పాథాలజీ అధికారి సుధ, హార్టికల్చర్ అధికారి సౌమ్య, వ్యవసాయ విస్తరణ అధికారి రజినికాంత్, రైతులు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి మృతిపై విచారణ


కపూర్‌నాయక్‌తండాలో విచారిస్తున్న వైద్యబృందం

అక్కన్నపేట(హుస్నాబాద్): విద్యార్థి మృతిపై వైద్య బృందం విచారణ చేపట్టింది. ఈ ఘటన కపూర్‌నాయక్‌తండాలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన అజ్మీర భాస్కర్‌నాయక్, స్వరూప దంపతుల పెద్దకుమారుడు అజ్మీర చరణ్(14) మంగళవారం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. అతడు హుస్నాబాద్‌లోని ఎస్సీ హాస్టల్‌లో ఉంటూ ప్రభుత్వ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. వారం రోజులుగా జ్వరం, జలుబు, దగ్గుతో బాధపడుతూ హాస్టల్ నుంచి ఇంటికి వచ్చాడు. తల్లిదండ్రులు ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్య పరీక్షలు చేయించారు. అయినా ఫలితం లేకపోవడంతో సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా.. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ విషయంపై రామవరం పీహెచ్‌సీ వైద్యధికారి వినోద్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం గ్రామంలో విచారణ చేపట్టారు. బాలుడి మృతిపై తల్లిదండ్రులను అడిగి పలువివరాలను, వైద్యపరీక్షలు చేయించిన రిపోర్డులను పరిశీలించారు. బాలుడు డెంగీతో మృతి చెందలేదని, వంశపార్యం పరంగా వచ్చే వ్యాధి కారణంగా మృతి చెందినట్లు డాక్టర్ వినోద్ రెడ్డి వెల్లడించారు. బాధిత కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలని సర్పంచ్ భానోతు సంతోష్‌నాయక్ కోరారు.

ప్రభుత్వ భూమిలో ఆయిల్‌పామ్

- దర్జాగా ఆక్రమించి సాగు
- చర్యలకు స్థానికుల డిమాండ్


ప్రభుత్వ భూమిలో సాగుచేసిన ఆయిల్‌పామ్

అక్కన్నపేట(హుస్నాబాద్): ప్రభుత్వ భూమిలో యథేచ్ఛగా ఆయిల్‌పామ్ సాగు చేస్తున్నాడు ఒక ఘనుడు. మండల పరిధిలోని కుందనవానిపల్లి గ్రామ శివారులో వైకుంఠధామ, డంప్‌యార్డు, క్రీడాప్రాంగణం మైదానానికి ఆనుకుని ఉన్న ప్రభుత్వ భూమిలో ఒకరైతు కొంత భాగాన్ని ఆక్రమించి దర్జాగా ఆయిల్‌పామ్ సాగుచేస్తున్నాడని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. స్థానికుల సమాచారం ప్రకారం.. సర్వే నంబర్ 96లో వందల ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఆయిల్‌పామ్ సాగుచేస్తున్న రైతుకు గత ప్రభుత్వం మూడెకరాల భూమినిచ్చింది. దానితో పాటు ఆ రైతు పక్కనే ఉన్న ప్రభుత్వ భూమిని కూడా కొంత భాగం ఆక్రమించుకుని దర్జాగా సాగు చేసుకుంటున్నాడని, దీనిపై అధికారులకు ఫిర్యాదులు చేశామని గ్రామస్తులు తెలిపారు. ప్రభుత్వ భూమిలో సాగు చేసిన రైతుపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పలువురు రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయంపై తహసీల్దార్ సంజీవ్‌కుమార్‌ను సంప్రదించగా.. ఆర్‌ఐని పంపించి విచారణ చేపడతానని చెప్పారు. ఎవరైనా ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

భర్త ప్రశ్నించడంతో వివాహిత అదృశ్యం


అనురాధ (ఫైల్)

శివ్వంపేట(నర్సాపూర్): భర్త ప్రశ్నించడంతో వివాహిత అదృశ్యమైన ఘటన శివ్వంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ రవికాంత్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పోతులబోగుడ గ్రామానికి చెందిన మాచవరం సుధాకర్‌కు 2013లో తూప్రాన్ మండలం యావపూర్ గ్రామానికి చెందిన కాగిత అనురాధతో వివాహం జరిగింది. వారికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఈ క్రమంలో అనురాధ సోమవారం ఫోన్‌లో మాట్లాడుతుండగా భర్త ప్రశ్నించడంతో గొడవపడింది. చిట్టి డబ్బులు కట్టడానికని ఆమె మంగళవారం ఇంట్లోంచి వెళ్లి సాయంత్రమైనా తిరిగి ఇంటికి రాకపోవడంతో సుధాకర్ చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. బీరువాలో ఉన్న రూ.50 వేలు కనిపించలేదని భర్త ఫిర్యాదులో పేర్కొన్నాడు.

ఫైనాన్స్ సిబ్బంది బైక్ తీసుకెళ్లారని..


ప్రవీణ్ (ఫైల్)

శివ్వంపేట(నర్సాపూర్): బైక్ ఫైనాన్స్ కట్టకపోవడంతో ఫైనాన్స్ సిబ్బంది బైక్‌ను తీసుకుని వెళ్లారని మనస్తాపంతో యువకుడు అదృశ్యమైన ఘటన పోతులబోగూడ గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ రవికాంత్‌రావు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన మంద ప్రవీణ్ గతంలో మేడ్చల్‌లోని ఓ ప్రవేట్ ఫైనాన్స్‌లో బైక్‌ను కొనుగోలు చేశాడు. కాని మూడు నెలలుగా వాయిదాలు చెల్లించక పోవడంతో ఈ నెల 3న ఫైనాన్స్ సిబ్బంది బైక్‌ను తీసుకుని వెళ్ళిపోయారు. వేలం వేయనున్నట్లు మంగళవారం నోటీస్ పంపించారు. దీంతో మనస్తాపానికి గురైన ప్రవీణ్ షోరూంకు వెళ్లి వస్తానని చెప్పి ఇంట్లోంచి వెళ్లిపోయాడు. రాత్రైనా తిరిగి రాకపోవడంతో తండ్రి మంద మైసయ్య ఫిర్యాదుతో కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరు ఆత్మహత్య

జీవితంపై విరక్తితో టీచర్...


రమేశ్ (ఫైల్)


దుబ్బాక: జీవితంపై విరక్తి చెందిన ఓ ఉపాధ్యాయుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్‌ఐ గంగరాజు కథనం ప్రకారం.. పట్టణానికి చెందిన యెమాజీగారి రమేశ్(48) ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తించేవాడు. రెండేళ్ల క్రితం ఆయన పక్షవాతం బారిన పడ్డాడు. అప్పటి నుంచి విధులు సక్రమంగా నిర్వహించలేకపోవడం, ఆర్థిక సమస్యల్లో కూరుకుపోవడం.. పెళ్లి కాకపోవడంతో మనోవేదన చెందుతూ ఉండేవాడు. ఈ క్రమంలో రమేశ్ జీవితంపై విరక్తితో మంగళవారం అర్ధరాత్రి గడ్డి మందు తాగి ఆత్మహత్య యత్నించాడు. బుధవారం ఉదయం వాంతులు చేసుకుంటున్న ఆయనను గమనించిన కుటుంబ సభ్యులు దుబ్బాక ప్రభుత్వ ఆసుపత్రికి, అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ మృతి చెందాడు.

మద్యం మత్తులో ఉరివేసుకొని..

పటాన్‌చెరు టౌన్: మద్యం మత్తులో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన పటాన్ చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. కర్ణాటక రాష్ట్రం బీదర్‌కు చెందిన జగదీశ్ దేశ్‌ముఖ్(38) భార్య శ్రీదేవితో కలిసి ఇస్నాపూర్ చౌరస్తాలో నివాసం ఉంటూ ఒక ప్రైవేట్ కంపెనీలో పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. వారి కూతురు శాలిని(3) ఇటీవల అనారోగ్యానికి గురవడంతో జగదీశ్ భార్య శ్రీదేవి తమ పాపను తీసుకుని బీదర్ వెళ్లింది. ఈ క్రమంలో మంగళవారం రాత్రి జగదీశ్ మద్యం మత్తులో భార్యకు ఫోన్‌చేసి తాను చనిపోతానని చెప్పాడు. దీంతో శ్రీదేవి తనకు పరిచయస్తుడైన బాలాజీకి ఫోన్‌చేసి వెళ్లి చూడమని కోరింది. ఆయన ఇంటికి వెళ్లి చూసేలోపు సీలింగ్ ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకుని ఉండటం గమనించి సమాచారం అందించాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

షార్ట్ సర్క్యూట్‌తో కిరాణా దుకాణం దగ్ధం

రూ.20లక్షల వరకు నష్టం


దుకాణంలో కాలిబూడిదైన సామగ్రి

సంగారెడ్డి టౌన్: షార్ట్ సర్క్యూట్‌తో కిరాణా దుకాణం దగ్ధమయిన ఘటన పట్టణ పరిధిలోని పోతిరెడ్డిపల్లిలో చోటుచేసుకుంది. చౌరస్తాలోని కిరాణా దుకాణం నిర్వాకుడు హనుమంతు రోజు మాదిరిగా బుధవారం మధ్యాహ్న సమయంలో దుకాణానికి తాళం వేసి ఇంటికి వెళ్లాడు. వెళ్లిన కొంతసమయానికి ఒక్కసారిగా షార్ట్ సర్క్యూట్ రావడంతో మంటలు వ్యాపించాయి. స్థానికులు అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం అందించారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పేశారు. అప్పటికే దుకాణంలో ఉన్న సామగ్రి కాలిబూడిదయింది. సుమారు రూ. 20 లక్షల వరకు నష్టం సంభవించినట్టు యజమాని వాపోయాడు. ఆర్థికంగా ఆదుకోవాలని కోరాడు.

ఆశపడితే అంతేసంగతులు

రెచ్చిపోతున్న సైబర్ నేరగాళ్లు

- రెండు నెలల్లో 515 కేసులు
- ఆన్‌లైన్ జాబ్, ఫోన్ కాల్స్‌తో బురిడీ
- మోసపోయిన వారిలో చదువుకున్నవారే అధికం

సైబర్ నేరాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లోనే జిల్లాలో 515 సైబర్ మోసాల కేసులు నమోదయ్యాయి. వాటిలో అమీన్‌పూర్, పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలోనే ఎక్కువ జరుగుతున్నాయి. మోసపోతున్నవారిలో చదువుకున్న వారే అధికంగా ఉండటం గమనార్హం.


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు (ఫైల్)

పటాన్‌చెరు టౌన్: చదువుకుని, ఉద్యోగాలు చేస్తున్న వారిని లక్ష్యంగా చేసుకుని కొత్త తరహాల్లో సైబర్ నేరగాళ్లు రోజురోజుకూ రెచ్చిపోతున్నారు. ప్రతి రోజు అధిక సంఖ్యలో సైబర్ కేసులు నమోదవడం ఆందోళన కలిగిస్తోంది. బాధితులు సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించినా నేరగాళ్లను పట్టుకున్న ఘటనలు చాలా తక్కువే. ఆన్‌లైన్ మోసాల వల్ల ప్రజలు అధిక మొత్తంలో నష్టపోతున్నారు.

మోసపోతున్నది ఇలా..

ఆన్‌లైన్ ఉద్యోగాలు, పార్ట్‌టైం జాబ్ అంటూ వచ్చిన మెసేజ్‌లకు స్పందించడం; ఫేస్ బుక్, ఇన్‌స్టాగాం వంటి సోషల్ మీడియా యాప్స్‌లో వాహనాలు, సెకండ్ హ్యాండ్ వస్తువుల ప్రకటన లింక్‌లను క్లిక్‌చేయడం; పార్ట్ టైం జాబ్ పేరుతో టాస్కులు ఇస్తూ నగదు ఇన్వెస్ట్ చేయించడం; అధిక డబ్బు సంపాదించవచ్చని ఆశ చూపించడం; డెబిట్, క్రెడిట్ కార్డులు అప్డేట్ చేయాలనడం; ఫోన్ ద్వారా డబ్బులు చెల్లిస్తామనే పేరుతో సైబర్ వలకు చిక్కుతున్నారు.

ఇటీవలే జరిగిన ఘటనలు

పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని సింఫోని కాలనీకి చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి ఆగస్టు 17న పార్ట్ టైం జాబ్ అంటూ తన వాట్సాప్‌కు మెసేజ్ వచ్చింది. ఆ ఉద్యోగి తన వివరాలు నమోదు చేశాడు. తర్వాత పలు దఫాలుగా రూ.30 లక్షలు చెల్లించాడు. అయితే సైబర్ నేరగాళ్లు ఆయన వాలెట్‌లో నగదుతో పాటు కమీషన్ చూపిస్తూ వచ్చారు. ఒక సమయంలో తన నగదుతో పాటు కమీషన్‌ను ఇవ్వాలని అడగడంతో అసలు విషయం బయటపడింది. దీంతో బాధితుడు తాను మోసపోయినట్టు గుర్తించి సైబర్‌తో పాటు పటాన్‌చెరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇదే తరహాలో రామచంద్రపురం మండల పరిధిలోని ఈదునాగులపల్లికి చెందిన ఓ ప్రైవేటు ఉద్యోగి రూ.26 లక్షలు, అమీన్‌పూర్ మండల పరిధిలోని లాలాబాయ్ కాలనీకి చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి రూ.28 లక్షలు చెల్లించారు. చివరిగా వారు తమ నగదు, కమీషన్ ఇవ్వాలని అడగ్గా స్పందనలేకపోవడంతో వారు సైబర్ పోలీసులకు సమాచారం ఇచ్చి, అమీన్‌పూర్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

1930కి సమాచారం అందించాలి



సాఫ్ట్‌వేర్, ప్రైవేటు ఉద్యోగులు, చదువుకున్నవారే ఎక్కువగా సైబర్ వలలో చిక్కుకుని మోసపోతున్నారు. పటాన్‌చెరు, అమీన్‌పూర్ బీడీఎల్, జిన్నారం బొల్లారం, గుమ్మడిదల, హత్నూర పోలీస్‌స్టేషన్ పరిధిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. అపరిచితుల నుంచి వచ్చే లింకులు, ఫోన్‌కాల్స్‌కు వ్యక్తిగత సమాచారం ఇవ్వద్దు. టాస్కులు, కమిషన్‌ల పేరుతో వచ్చే ఆన్‌లైన్ జాబులను నమ్మొద్దు.

– డీఎస్పీ పురుషోత్తం రెడ్డి, పటాన్‌చెరు

పోలీసుల సూచనలు

అపరిచితుల వాట్సాప్, ఫోన్‌కాల్స్‌కు స్పందించకుండా ఉండాలి. ఆన్‌లైన్లో తక్కువ ధరకే వస్తువులు, సేవలు అందిస్తామనే ప్రకటనలు చూసి మోసపోవద్దు. అన్నీ పరిశీలించిన తర్వాతే నగదు చెల్లించాలి. సోషల్ నెట్వర్క్ సైట్లలో మహిళలు ప్రైవసీకి ప్రాధాన్యం ఇవ్వాలి. ఎవరితోనూ వ్యక్తిగత ఫోటోలు షేర్ చేసుకోకపోవడమే మంచిది. ఉచిత వైఫై, ఓపెన్ నెట్‌వర్క్‌ల ద్వారా లాగిన్‌ఐతే సైబర్ నేరగాళ్లు పాస్‌వర్డ్ దొంగతనంచేసే అవకాశం ఎక్కువ.